కొత్త ఏడాదికి ఘన స్వాగతం

అంబర్‌పేట, జనవరి 1 : ప్రజలు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. చిన్నాపెద్ద సంబురాలు జరుపుకొంటూ కొత్త ఆశలతో అడుగులు వేశారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని ఆలయాలన్నీ భక్తులతో రద్దీగా మారాయి. అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట, గోల్నాక, నల్లకుంట, కాచిగూడ ప్రాంతాల్లో తెల్లవారు జామునే మహిళలు నిద్రలేచి ఇంటి ఎదుట ముగ్గులు వేశారు. కొత్త ఏడాదిని ఆహ్వానిస్తూ కేక్ కట్ చేశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు తమ తమ గాడ్‌ఫాదర్‌లను కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కోటి ఆశలతో...కొత్త వత్సరం

గోల్నాక : కొత్త సంవత్సరంలో అన్ని విజయాలే కలుగాలని ఆకాంక్షిస్తూ మంగళవారం అర్ధరాత్రి 2025కు అంబర్‌పేట ప్రజలు స్వాగతం పలికారు. యువకులు వీధుల్లో ద్విచక్రవాహనాలపై తిరుగుతూ ఉత్సాహం చూపారు. బంధుమిత్రులకు తమదైన శైలిలో శుభాకాంక్షలు తెలిపారు.

కిటకిటలాడిన ఆలయాలు

అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని ఆలయాలు బుధవారం ఉదయం నుంచే కిటకిటలాడాయి. అన్ని శుభాలే కలుగాలని ఆకాంక్షిస్తూ పలు ఆలయాల్లో ప్రజలు పూజలు చేశారు. అంతటా.. పండగ వాతావరణం సంతరించుకున్నది.

అందమైన రంగవల్లులు..

కాచిగూడ : గోల్నాక శ్రీ సాయిరెసిడెన్సీ మహిళలు రంగు రంగుల ముగ్గులను వేశారు. ముగ్గుల పోటీల్లో మహిళలు పాల్గొని చూపరులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో చందనశర్మ, పి.రమాదేవి, మమత, ఝాన్సీ, స్వాతి,లక్ష్మి పాల్గొన్నారు.

గోల్నాకలో ముగ్గులు వేస్తున్న మహిళలు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అంబర్‌పేట, జనవరి 1 : అంబర్‌పేట నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో 2వ తేదీ గురువారం చెట్లకొమ్మల తొలగింపు కార్యక్రమంలో భాగంగా విద్యుత్ నిలిపివేస్తున్నట్లు సెంట్రల్ బ్రేక్ డౌన్ ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. ట్రీ ట్రిమ్మింగ్, లైన్ ఏబీ స్విచ్‌లు, డీటీఆర్ ఏబీ స్విచ్‌లు, డబుల్ జంపర్స్ రెక్టిఫికేషన్, మెయింటెనెన్స్ వర్క్ కోసం విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

– 11 కేవీ కమలానగర్ ఫీడర్ (33 / 11కేవీ గోల్నాక ఎస్ఎస్) పరిధిలోని కమలానగర్, కృష్ణానగర్, శంకర్‌నగర్, పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

– 11 కేవీ కృష్ణానగర్ ఫీడర్ (33 / 11కేవీ దుర్గానగర్ ఎస్ఎస్) పరిధిలోని తులసీనగర్, గంగానగర్, వెంకటేశ్వర నగర్, మాముకా మండీ, కృష్ణానగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 11: 30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు

– 11 కేవీ తులసీనగర్ (33 / 11కేవీ గోల్నాక ఎస్ఎస్) పరిధిలోని తులసీనగర్, గోల్నాక, ఛే నంబర్ ప్రధాన రహదారి ప్రాంతాల్లో మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 4:30 వరకు

–11కేవీ ఇందిరానగర్ ఫీడర్ (33/11కేవీ బతుకమ్మకుంట ఎస్ఎస్) ప్రాంతాలు తిలక్‌నగర్ మెయిన్‌రోడ్డు, కిషన్‌రావు హాస్పిటల్ వెనుకవైపు, ఇందిరానగర్, తిలక్‌నగర్ వంతెన పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3:30 నుంచి సా యంత్రం 5 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఏడీఈ నాగేశ్వర్‌రావు వెల్లడించారు.

ఆన్‌లైన్‌లో సైబర్ సెక్యూరిటీ, ఏఐ డేటా సైన్స్ కోర్సుల శిక్షణ

కాచిగూడ, జనవరి 1: కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ఏఐ డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా కోర్సులకు ఆన్‌లైన్ శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ స్కిల్ అకాడమీ ప్రోగ్రాం కో – ఆర్డినేటర్ సాయి శ్రీమాన్‌రెడ్డి తెలిపారు. బుధవారం కాచిగూడలో విలేకరులతో మాట్లాడుతూ.. 100కు పైగా అంతర్జాతీయ సాఫ్ట్ వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వన్నుట్లు .. సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్ కోర్సులు, ఆర్కిటెక్ట్, సెక్యూరిటీ విభాగం, డేటాసైన్స్, బిగ్‌డేటా,క్లౌడ్ కంప్యూటర్, జావా, ఓరాకిల్ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో 2–6 నెలల శిక్షణ ఇవ్వన్నుట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, డిప్లొమా, పీజీ, ఇంజినీరింగ్ అర్హత ఉన్నవారు 9వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9505800050,www.nationalskillacademy.inలో సంప్రదించవచ్చని కోరారు.

శ్రీవారి సన్నిధిలో..

నూతన సంవత్సరం సందర్భంగా అంబర్ పేట కార్పొరేటర్ బుధవారం ఉదయం తిరుమల తిరుపతి శ్రీవారిని దర్శించుకున్నారు. తలనీలాలు సమర్పించిన ఆయన స్వామివారిని ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. కార్పొరేటర్ వెంట సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు లవంగు ఆంజనేయులు, పలువురు నాయకులు ఉన్నారు.

– గోల్నాక

అజంతా రైల్లో దొంగతనం

కాచిగూడ,జనవరి 1: అజంతా రైల్లో ప్రయాణికురాలి నగదు, సెల్‌ఫోన్‌లను దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. మణికొండకు చెందిన మూర్తి భార్య నాగమణి విశ్రాంత పోస్టల్ ఉద్యోగి. అజంతా రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గమద్య ఆమె బ్యాగును దొంగిలించారు. అందులో రూ.12 వేలు, ఖరీదైన 2 సెల్‌ఫోన్లు, గడియారం, ఆధార్‌కార్డులు ఉన్నట్లు తెలిపారు. బుధవారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపారు.

నృత్యరూపకాలు..వారసత్వ సంపద

కూచిపూడి నృత్యకారిణులతో డా.మామిడి హరికృష్ణ, డాన్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు పాతులూరి జయంతి

రవీంద్రభారతి, జనవరి 1 : పండుగలు, శాస్త్రీయ నృత్యరూపకాలు మన దేశ వారసత్వ సంపదలని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. కళారాధన కూచిపూడి డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం రవీంద్రభారతిలోని ప్రధాన కళామందిరంలో సంక్రాంతి సంబురాలు కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి వక్తలుగా మామిడి హరికృష్ణ, కూచిపూడి కళానికేతన్ ఫౌండర్ డా.వేదాంతం వెంకట నాగ చలపతి రావు, సినీ రచయిత పి.ఎన్.మూర్తి, డాక్టర్ జయరామన్ బాలకృష్ణ విచ్చేశారు. కళారాధన కూచిపూడి డాన్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు, నాట్య గురువు పాతులూరి జయంతి శిక్షణలో నృత్యకారిణిలు తయారయ్యారని కొనియాడారు. కార్యక్రమంలో కళారాధన కూచిపూడి డాన్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు పాతులూరి జయంతి, ఘంటసాల పవన్‌కుమార్, నాట్యగురువులు జి.నళిని, శ్రీలక్ష్మి శాంకరి, ప్రసన్న,జోత్స బిన్నా పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బుధవారం నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్ గౌడ్, నాయకులు ప్రదీప్‌కుమార్ అగర్వాల్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. - మెహిదీపట్నం

మాజీ మంత్రి, సిరిసిల్ల శాసన సభ్యులు కల్వకుంట్ల తారకరామారావును నూతన సంవత్సరంగా సందర్భంగా పార్టీ కార్యాలయంలో గోషామహల్ నియోజకవర్గం నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. - అబిడ్స్

'కార్వాన్ నుంచి 500 మంది వెళ్తున్నాం'



మెహిదీపట్నం, జనవరి 1 : సావిత్రీబాయి పూలె జయంతి సందర్భంగా జనవరి 3న ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాసభకు కార్వాన్ నియోజకవర్గం నుంచి 500 మంది బీసీ కులాల నాయకులు తరలివెళ్లనున్నట్లు కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కోడూరి శ్రీధర్ సాగర్ తెలిపారు. బుధవారం బీఆర్ఎస్ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో శ్రీధర్‌సాగర్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థలో 42 శాతం బీసీల రిజర్వేషన్ల సాధనకై ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో నిర్వహించనున్న సభకు తరలివెళుతున్నామని పేర్కొన్నారు.

'అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు'

కాచిగూడ : అంకితభావంతో పని చేస్తే గుర్తింపు ఉంటుందని కాచిగూడ డివిజన్ ఏసీపీ వి.రఘు అన్నారు. కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేసిన 1987 బ్యాచ్‌కు చెందిన జి.వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ పొందాడు. బుధవారం కాచిగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ ఆధ్వర్యంలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. కాచిగూడ డీఐ సురేశ్‌బాబు, ఎస్సైలు సుభాష్, పి.రవికుమార్, హెచ్.నరేశ్, సురేశ్‌కుమార్, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుల్స్, సిబ్బంది వెంకటేశ్వర్లు దంపతులను అభినందించారు.

మహా కుంభ మేళా పోస్టర్ ఆవిష్కరణ

ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగనున్న మహాకుంభ మేళాకు సంబంధించి లంగర్ హౌస్ సంగం రామాలయం మఠం ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను బుధవారం గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, మఠాధిపతి రాహుల్‌దాస్ బాబాతో కలిసి ఆవిష్కరించారు. నాయకులు వినేష్ సింగ్,శ్రీకాంత్‌చారి పాల్గొన్నారు.

- మెహిదీపట్నం

అనసూయమ్మ సేవలు చిరస్మరణీయం



అనసూయమ్మ వర్ధంతి సభలో పాల్గొన్న జడ్జి మైత్రేహి,భురం శంకర్, వినోద్‌కుమార్, మల్లికార్జున్

కాచిగూడ, జనవరి 1: సంఘసేవకురాలు, వీరభద్రస్వామి సేవా సమితి వ్యవస్థాపకురాలు కాసుల అనసూయమ్మ వెంకటేశం సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమని 8వ ఏడీఎస్ఎల్ మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి జె.మైత్రేహి అన్నారు.

బుధవారం కాసుల అనసూయమ్మ వెంకటేశం ప్రథమ వర్ధంతి సంస్మరణ సభ నిర్వహించారు. బార్ కౌన్సిల్ సభ్యుడు భురం శంకర్, డాక్టర్ సూర్యప్రకాశ్, డాక్టర్ అఖిల్ కుమార్ ఝా, న్యాయవాదులు వినోద్‌కుమార్, ప్రమోద్, మహిపాల్, నరేందర్, అనసూయ వెంకటేశం చారిటబుల్ మేనేజింగ్ ట్రస్టీ కాసుల మల్లికార్జున్, కుటుంబ సభ్యులు, చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అనసూయమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పేద విద్యార్థులు చదువుకోవడానికి రూ.10 వేల ఆర్థికసాయం, నోట్‌బుక్స్‌ను జడ్జి జె.మైత్రేహి అందజేశారు.

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ బుధవారం కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. - అబిడ్స్

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, శాసన సభ్యులు దానం నాగేందర్‌ను నూతన సంవత్సరం సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు టి. సతీశ్ బుధవారం కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

- అబిడ్స్

స్పెషల్ డ్రైవ్‌లో కేసులు నమోదు

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న నాంపల్లి ట్రాఫిక్ పోలీసులు

తెలుగు యూనివర్సిటీ, జనవరి 1 : నాంపల్లి ట్రాఫిక్ పోలీసులు మంగళవారం రాత్రి 10 నుంచి బుధవారం తెల్లవారుజామున 4 గంటల వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నాంపల్లి రైల్వే స్టేషన్, అసెంబ్లీ మెట్రో స్టేషన్ ప్రాంతాల్లో సీఐ టి. కిరణ్‌కుమార్ నేతృత్వంలో ఎస్సైలు శివకుమార్, అహ్మద్ పాషా సిబ్బందితో కలిసి చేపట్టిన తనిఖీల్లో 35మంది వాహనదారులు మోతాదుకు మించి మద్యం సేవించి పట్టుబడ్డారు. 31మంది టూ వీలర్, ఒకటి త్రీ వీలర్, ముగ్గురు కార్లు నడుపుతున్న వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ప్రత్యేక డ్రైవ్‌లో 20 మంది సిబ్బంది పాల్గొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టామన్నారు.

తాగారు.. దొరికారు

సుల్తాన్‌బజార్‌లో 47 డీడీ కేసులు

సుల్తాన్‌బజార్ : నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు నేతృత్వంలో 47 కేసులు నమోదైనట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

కాచిగూడ : ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి లింగంపల్లి ఎక్స్‌రోడ్, బర్కత్‌పుర తెలంగాణ యువతి మండలి సమీపంలో ట్రాఫిక్ సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. 33 మంది ద్విచక్ర వాహనదారులు పట్టుబడగా.. 31 ద్విచక్రవాహనాలు, 2 కార్లు ఉన్నాయి.

సమన్వయంతో పనిచేయాలి

ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి ప్రభుత్వాధికారులు సమన్వయంతో పనిచేయాలని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే మల్లేపల్లిలో పర్యటించి బడీ మసీద్ ప్రాంతంలో నిర్మిస్తున్న వీడీసీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్ పాల్గొన్నారు.

- మెహిదీపట్నం

కార్వాన్ నియోజకవర్గం గోల్కొండ ఎండీలైన్స్‌లో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ బుధవారం పర్యటించారు. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రజలతో మాట్లాడారు. ఎండీలైన్స్‌లో అంతర్గతరోడ్ల పనులను త్వరలో చేపట్టడం జరుగుతుందని, డ్రైనేజీ పనులను వేగంగా పూర్తి చేయడానికి అధికారులతో చర్చిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

- మెహిదీపట్నం

ఉస్మానియా నూతన భవన నిర్మాణ ఆలోచనను ఉపసంహరించుకోవాలి

గోషామహల్ స్టేడియంలో ప్రభుత్వం తలపెట్టిన ఉస్మానియా దవాఖాన నూతన భవన నిర్మాణం ఆలోచనను ఉపసంహరించుకోవాలని కోరుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను బుధవారం భారాస వాణిజ్య విభాగం రాష్ట్ర నాయకులు గొడుగు గోపీయాదవ్, బెజిని శ్రీనివాస్, యాదగిరి, కిట్టు కలిసి స్థానికుల సమస్యలు తెలిపారు.

- అబిడ్స్

అబిడ్స్ : అజ్మీర్‌దర్గాలో మాజీ హోంమంత్రి మహమూద్ అలీ కుమారుడు, మలక్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి అజం అలీ, బీఆర్ఎస్ మైనార్టీ రాష్ట్ర నాయకుడు ఖాజా బద్రుద్దీన్, రాష్ట్ర నాయకులు అబ్దుల్ బాసిత్, మహ్మద్ యూసఫ్ పాల్గొని చాదర్ సమర్పించారు.